## కోరితే... మధ్యవర్తిత్వం

భారత్, పాకిస్తాన్‌లు రెండూ కోరుకుంటే వాటి మధ్య జరిగే ద్వైపాక్షిక చర్చల్లో మధ్యవర్తిగా వ్యవహరించడానికి తాను సిద్ధమేనని అమెరికా ప్రతిపాదించింది. కశ్మీర్‌తో సహా పలు ద్వైపాక్షిక సమస్యల పరిష్కారానికి శాంతి చర్చల్ని పునఃప్రారంభించాలని భారత ప్రధాని మన్మోహన్‌సింగ్, పాక్ ప్రధాని యూసుఫ్ రజా గిలానీలు నిర్ణయించుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఇరుపక్షాలు కోరుకుంటే ఈ విషయంలో సహాయం చేయడానికి తాము సిద్ధమేనని అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జేమ్స్ జోన్స్ జూన్ 6న వాషింగ్టన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో చెప్పారు. పాక్ తమకు వ్యతిరేకంగా తీవ్రవాద కార్యకలాపాలకు పాల్పడుతోందంటూ భారత్ వ్యక్తం చేస్తున్న ఆందోళన సమర్థనీయమేనని ఆయన అన్నారు. భారత్, పాకిస్తాన్‌ల మధ్య మొదలైన ప్రాథమిక సంప్రదింపులు కశ్మీర్‌తో సహా వివిధ సమస్యలను పరిష్కరించే పూర్తిస్థాయి చర్చలుగా మారాలని ఆశిస్తున్నామని జోన్స్ అన్నారు.

## భారత పర్యటనపై ఒబామా ఆశాభావం

భారత్‌కు ఈ ఏడాది నవంబర్‌లో తొలిసారి రానున్న అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా, తన పర్యటన ఆశాజనకమైన ఫలితాలను సాధిస్తుందని ఆశిస్తున్నారు. వ్యూహాత్మక అంశాలలో మరింత సన్నిహిత సంబంధాలను నెలకొల్పుకునే దిశగా ఈ పర్యటన సాగగలదని ఆయన ఆశాభావంతో ఉన్నారు. భారత్‌తో అమెరికా సంబంధాలు 21వ శతాబ్ది ప్రపంచంలో విడదీయరానివిగా ఒబామా స్వయంగా భావిస్తున్నారని అమెరికా విదేశాంగ శాఖ దక్షిణ, మధ్య ఆసియా విభాగం సహాయ మంత్రి రాబర్ట్ బ్లేక్ చెప్పారు.

## ఫిలిప్పీన్స్ అధ్యక్షుడిగా అక్వినో

బెనినో అక్వినోను ఫిలిప్పీన్స్ అధ్యక్షుడిగా అధికారికంగా ప్రకటించారు. గత నెలలో జరిగిన ఎన్నికల్లో అద్భుత విజయం సాధించడంతో తర్వాతి అధ్యక్షుడిగా ఆయన అధికారం చేపట్టనున్నారు. పార్లమెంటు సంయుక్త సమావేశం ఫలితాలను వెల్లడించి, 15వ అధ్యక్షుడిగా అక్వినో పేరును అధికారికంగా ప్రకటించింది.

## అటార్నీ జనరల్ పదవికి భారత అమెరికన్

కాలిఫోర్నియా అటార్నీ జనరల్‌కు డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థిగా భారత అమెరికన్, ప్రముఖ ఉద్యమకారిణి కమలా హారిస్ ఎన్నికయ్యారు. జూన్ 8న జరిగిన ప్రాథమిక ఎన్నికల్లో ఫేస్‌బుక్ ఎగ్జిక్యూటివ్ క్రిస్‌కెల్లీ సహా ఆరుగురిని ఓడించారు. అటార్నీ జనరల్ పదవికి నవంబర్‌లో జరిగే ఎన్నికల్లోనూ హారిస్ ఎన్నికైన పక్షంలో... ఈ పదవిని అధిష్టించిన తొలి మహిళ ఆమె అవుతారు. హారిస్ ప్రస్తుతం శాన్‌ఫ్రాన్సిస్కో అటార్నీ జనరల్‌గా ఉన్నారు.

## పాక్‌లో నాటో వాహనశ్రేణిపై ఉగ్రవాదుల దాడి

పాకిస్తాన్ రాజధానికి సమీపంలోనే నాటో వాహనశ్రేణిపై జూన్ 9న ఉగ్రవాదులు విరుచుకుపడ్డారు. అఫ్గానిస్తాన్‌లోని నాటో, అమెరికా దళాలకు సరుకు సరఫరా చేసే ఈ వాహనశ్రేణిపై జరిగిన దాడిలో 8 మంది మృతిచెందారు. ఉగ్రవాదులు సుమారు 60 వాహనాలకు నిప్పు పెట్టారు. కోట్లాది రూపాయల సామాగ్రి ధ్వంసమైంది.

## ఇరాన్‌పై మళ్ళీ ఐరాస ఆంక్షలు

అణ్వాయుధ కార్యకలాపాలకు పాల్పడుతోందన్న నెపంతో ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి ఇరాన్‌పై నాలుగో దఫా ఆంక్షలు విధించింది. మండలిలోని 12 దేశాలు ఈ మేరకు తీర్మానానికి మద్దతు ప్రకటించగా... బ్రెజిల్, టర్కీ వ్యతిరేకించాయి లెబనాన్ ఓటింగ్‌కు దూరంగా ఉంది.

**ఆంక్షలివే :** అణ్వాయుధ కార్యక్రమాలకు సంబంధించి విదేశాల్లో ఇరాన్ పెట్టుబడులపై నిషేధం. ఖండాంతర క్షిపణి తయారీ కార్యకలాపాలపై నిషేధం. విదేశీ బ్యాంకు ఖాతాలను ఇరాన్ ఉపయోగించుకోనివ్వకుండా చూడటం. ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్స్ ఆస్తులను స్తంభింపజేయడం. ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్స్‌కి చెందిన 15 వాణిజ్య సంస్థలను బ్లాక్‌లిస్టులో ఉంచడం. ఇరాన్‌కు చెందిన 23 పారిశ్రామిక కంపెనీలు, నౌకా విభాగానికి చెందిన మూడు సంస్థలను బ్లాక్‌లిస్టులో ఉంచాలని తీర్మానించారు.

## గిలానీ ఆఫీసులో రహస్య సమాచారం చోరీ

కాంట్రాక్టు పద్ధతిలో నియమితులైన ఉద్యోగులు పాక్ ప్రధాని యూసుఫ్ రజా గిలానీ కార్యాలయం నుంచి కొన్ని రహస్య పత్రాలతో పాటు మరికొంత అధికారిక సమాచారం దొంగిలించారు. సురక్షితమైన కంప్యూటర్ వ్యవస్థలోకి చొరబడి దొంగిలించిన ఆ సమాచారం ఏమిటో వెంటనే తెలియరాలేదని డాన్ పత్రిక వెల్లడించింది. ప్రభుత్వ సంబంధిత సమాచారాన్ని సంరక్షించేందుకు, కంప్యూటరైజ్ చేసేందుకు ఉద్దేశించిన లక్షలాది రూపాయల విలువైన ప్రాజెక్టు ప్రధానాధికారి రహస్య సమాచారంతో పరారైనట్లు పత్రిక తెలిపింది.

## కశ్మీర్ అంశంకంటే సీమాంతర ఉగ్రవాదమే సమస్య

భారత్-పాక్‌ల నడుమ సమగ్ర చర్చల పునరుద్ధరణకు కశ్మీర్ అంశం కంటే, సీమాంతర ఉగ్రవాదమే అసలు సమస్య కాగలదని అమెరికా అభిప్రాయపడింది. అలాగే ముంబై దాడుల్లో నిందితుల విచారణ కూడా కీలకాంశం కాగలదని అభిప్రాయపడింది. భారత్- పాక్‌ల మధ్య కశ్మీర్ కీలకమైన సమస్యే అయినా, ప్రస్తుత తరుణంలో ఉభయ దేశాల నడుమ జరిగే చర్చల్లో కశ్మీర్ అంశంకంటే, ముంబై దాడుల నిందితులపై విచారణలో ఇప్పటివరకు సాధించిన పురోగతి, సీమాంతర ఉగ్రవాదాన్ని అరికట్టేందుకు పాక్ తీసుకుంటున్న చర్యలు ప్రధానంగా ప్రస్తావనకు వచ్చే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నట్లు అమెరికా విదేశాంగ శాఖ సహాయ మంత్రి రాబర్ట్ బ్లేక్ అన్నారు.